క్లుప్తంగా

అనాథ ఆశ్రమ సందర్శన



ఆశ్రమంలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి విజయ్‌రాజ్ కుమార్

బొండపల్లి: ఒంపల్లి గ్రామంలోని శాంతి నివాస్ అనాథ ఆశ్రమాన్ని గజపతినగరం ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి ఏ.విజయ్‌రాజ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఆశ్రమ పరిసరాలను పరిశీలించిన అనంతరం నిర్వాహకులతో మాట్లాడారు. ఆశ్రమం లో బాలుర, బాలికలు ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో సదుపాయాలపై బాలురు, బాలికలను ఆరా తీశారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. జడ్జి వెంట కోర్టు సిబ్బంది ఉన్నారు.

పక్కాగా భూరీసర్వే చేపట్టాలి



రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొండపల్లి: సమగ్ర భూరీసర్వేను పక్కాగా చేపట్టాలని, గ్రామాల్లో ప్రతీ రైతుకు చెందిన భూకమతం వివరాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు సిబ్బందికి సూచించారు. బిల్లలవలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమగ్ర భూరీసర్వేను ఆయన పరిశీలించారు. సర్వే సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సర్వే చేసిన తర్వాత భూముల వివరాలను జీటీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రైతుల సమక్షంలోనే సర్వే చేపట్టాలని సూచించారు.

టీవీ, ఫ్రిజ్ వితరణ



పెళ్లి కుమార్తె కుటుంబీకులకు ఎల్ఈడీ టీవీ అందజేస్తున్న రమణ

చీపురుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పేదింటి ఆడపిల్లల వివాహాలకు తమ ట్రస్టు సహ కారం అందిస్తోందని శ్రీ దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు ముల్లు రమణ తెలిపారు. గరివిడి మండలం, కుమరాం గ్రామానికి చెందిన మలిశెట్టి ముత్యాలు, నారాయణ దంపతుల కుమార్తె అనురాధ వివాహానికి ట్రస్టు తరపున సహాయం అందించారు. పెళ్లి కుమార్తె కుటుంబ సభ్యులకు చీపురుపల్లిలోని తన నివాసం వద్ద ముల్లు రమణ ఎల్ఈడీ టీవీ, ఫ్రిజ్ అందజేశారు.

శత్రుంజయ హోమం



హోమం చేస్తున్న వేదపండితుడు

బొండపల్లి: పాకిస్తాన్‌తో యుద్ధవాతావరణం నేపథ్యంలో భారత సైనికులకు మనోధైర్యం పెంచేలా, విజయం సాధించేలా చూడాలని కోరుతూ గరుడుబిల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో గ్రామస్తులు శుక్రవారం శత్రుంజయ హోమం నిర్వహించారు. పాకిస్తాన్‌తో ఒక వేళ యుద్ధం వచ్చినా భారత సైనికులను కాపాడాలని కోరుతూ వేదపండితులతో హోమం జరిపించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ తిరుపతినాయుడు

బొండపల్లి: కొత్తపాలెం గ్రామంలో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ తిరుపతినాయుడు శుక్రవారం పరిశీలించారు. పైపులైన్, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు ఎంతవరకు పూర్తయ్యింది, తాగునీరు సరఫరాకు ప్రస్తుతం ఉన్న రక్షిత మంచి నీటి పథకం సరిపోతుందా లేదా అనే అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం పశువుల నీటి తొట్టెలకు నీరు సరఫరా చేసేందుకు బోర్ల ఏర్పాటుకుస్థల పరిశీలన చేశారు. ఆయన వెంట జేఈఈ సునీల్‌కుమార్,మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము,పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

రైలొస్తే..ఆగాల్సిందే..!

- పురిటిపెంటలో ఆర్ఓబీ లేక అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- తరచూ రైల్వే గేటు వేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య
- మూడో రైల్వే ట్రాక్ నిర్మాణం పూర్తయితే మరింత పెరగనున్న కష్టాలు
- ఆర్ఓబీ నిర్మించాలని కోరుతున్న ప్రజలు



రైల్వే గేటు పడడంతో వేచి ఉన్న ప్రయాణికులు

గజపతినగరం: మండల కేంద్రంలోని పురిటిపెంట రైల్వే గేటు వద్ద ఆర్ఓబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) లేకపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇతర ప్రాంతాల వారితో పాటు గజపతినగరం, మెంటాడ మండలాలకు చెందిన గ్రామాల వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పగటి పూటే రోజుకు ఆరు నుంచి ఏడు సార్లు గేటు వేస్తుంటారు. గేటు వేస్తున్నప్పుడల్లా కనీసం 15 నిముషాల పాటు రెండు వైపులా వాహనాలు నిలిచిపోతుంటాయి. ఉన్న రెండు ట్రాక్‌లపై ఒకేసారి రెండు ట్రైన్‌లు వస్తే కనీసం 20 నిముషాలు పాటు గేటు తెరచుకోదు. అత్యవసరమైనా సరే వాహనాలు ముందుకు వెళ్లలేని స్థితి. పలుమార్లు 108 వాహనాలు ఇక్కడ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. మెంటాడ మండలంలోని గ్రామాల నుంచి, గిరిజన ప్రాంతాల నుంచి అనారోగ్యంతో, గర్భిణులు 108 వాహనంలో వచ్చే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్న రెండు ట్రాక్‌ల వల్లే ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే...తాజాగా మూడో ట్రాక్ ఏర్పాటు కోసం రైల్వే అధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు. మూడో ట్రాక్ ప్రారంభమైతే రోజుకు ఎన్నిసార్లు గేటు పడుతుందోనని వాహన చోదకులు, ఈప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆర్ఓబీ నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పార్లమెంట్‌లో ప్రస్తావించిన బెల్లాన

ఇక్కడి సమస్యను వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. ఆర్ఓబీ మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అయితే అప్పటిలో కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగానే స్పందించింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ విషయం పూర్తిగా మరుగున పడిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ఓబీ ఊసే లేకుండా పోయింది.

ఆర్ఓబీ నిర్మించాలి



రైల్వే గేటు పడుతున్నప్పుడల్లా వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ గేటు పడేది తక్కువ డబుల్ గేటు పడేది ఎక్కువ. దీనికి తోడు మూడో ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. ముమ్ముందు ఇబ్బందులు మరింత పెరుగు తాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్ఓబీ నిర్మించాలి.

–పప్పల గురినాయుడు, పాతబగ్గాం, గజపతినగరం మండలం.

కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలి



గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఆర్ఓబీ నిర్మాణ విషయమై కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చాం. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఇక్కడి ప్రజల సమస్యలను తెలుసుకుని ఆర్ఓబీ నిర్మాణం చేపట్టాలని పలు మార్లు పార్లమెంట్‌లో కోరారు.ఇంతలో ఎలక్షన్ వచ్చేయడంతో మిగతా వ్యవహారం ముందుకు సాగలేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించి సమస్యను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి ఆర్ఓబీ నిర్మాణానికి కృషి చేయాలి.

గార తవుడు, గజపతినగరం

అభివృద్ధి అజెండాగా పనిచేద్దాం..



అభివృద్ధి అజెండాగా పనిచేద్దామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. జామి మండల కేంద్రంలో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. వీరికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పరిషత్ అధికారులు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పరస్పర సహకారంతో పనిచేయాలన్నారు. సమావేశం మందిర నిర్మాణా నికి జిల్లా పరిషత్ నుంచి రూ.25లక్షలు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండలాల అభివృద్ధి కోసం జెడ్పీ నుంచి నిధులు విడుదల చేస్తున్నామన్నారు.అనంతరం ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సరయు, పలుగ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



నీలకంఠరాజపురం గ్రామంలో మూడురోజుల పాటు నిర్వహించిన తుడుపులమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ముగిశాయి. మూడో రోజు శుక్రవారం వేదపండితులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. – వేపాడ

'సాక్షి'పై కక్ష సాధింపు సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ఎడిటర్ల ఇళ్లపై దాడులు చేయించడం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎలాంటి సెర్చ్ వారంట్, ముందస్తు నోటీసు లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో దౌర్జన్యంగా పోలీసు అధికా రులు సోదాలు చెయ్యడం, అలాగే ఆయనపై ఏసీపీ దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని, ఇంతకముందెప్పుడూ రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి లేదని అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పుణ్యమాని రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యం ఎలాగూ లేదని, ఇప్పుడు భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందని, మళ్లీ బ్రిటీష్ పరిపాలన గుర్తుకు తెస్తున్నారని మండిపడ్డారు. న్యాయస్థానాల తీర్పులు కూడా పట్టించుకోకుండా సాక్షి పత్రికకు సంకెళ్లు వెయ్యాలని, మీడియా గొంతు నొక్కాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. కచ్చితంగా ఇలాంటి చర్యలు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనన్నారు. కూటమి ప్రభుత్వం ఈ పదినెలల పాలనలో కక్ష సాధింపు చర్యలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారి మీద కేసులు పెట్టడం తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని, పథకాలు అమలు చేసిందీ లేదన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, ఎందుకు వీరిని అధికారంలోకి తెచ్చామా అంటూ బాధపడుతున్నారన్నారు. రాబోయే కాలంలో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ప్రవేశాల కోసం ప్రచారం



మామిడిపల్లిలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాలలో బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వ హిస్తున్న జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు అధ్యాపక సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మండలంలోని సీతారాంపురం, గోపాలపల్లి, మామిడిపల్లి, ధర్మ వరం, సన్యాసయ్యపాలెం గ్రామాల్లో శుక్రవారం ప్రచారం చేశారు. పదోతరగతి ఉత్తీ ర్ణులైన విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి తమ కళాశాలలో సౌకర్యాలను వివరించి, జాయిన్ కావాలని కోరారు. హెచ్ఎం ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు రహీం షేక్‌లాల్, ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'విముక్తి' నాటిక

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీ లను గరివిడి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో=శ్రీరామ్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. గుంటూరు ఉషోదయ కళాపరిషత్ ఆధ్వర్యంలో సాంబశివరావు రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన 'విముక్తి' నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. పంటలు పండక అప్పుల పాలవుతున్న రైతుల దుస్థితిని, పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు వారుపడుతున్న ఇబ్బందులను, గంజాయి, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్న విధానాన్ని ప్రదర్శించారు. మత్తుపదార్థాల నుంచి యువతకు విముక్తి కలిగిద్దాం, దేశాన్ని రక్షించుకుందా అనే సందేశంతో ఈ నాటిక ముగిసింది.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామ సచివాలయంలో గ్రామస్తులకు సమాచార హక్కు చట్టంపై ఈఓపీఆర్డీ వాణిశ్రీ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల గురించి సమాచారం తెలుసుకునే హక్కు ప్రతీ పౌరుడికి ఉందన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి పౌరులు అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. స్థానిక నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధం కండి



సీఐటీయూ సమావేశానికి హాజరైన కార్మిక సంఘాల సభ్యులు

శృంగవరపుకోట: హక్కుల పరిరక్షణ కోసం సమ్మెబాట పట్టేందుకు కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీహెచ్.ముత్యాలు అధ్యక్షతన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, మిడ్ డే మీల్స్, స్కూల్‌శానిటేషన్ వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, ఆటోడ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్, కార్యదర్శి రమణ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను సమూలంగా మార్చేసి, నాలుగు లేబర్‌కోడ్స్‌గా మార్చిందన్నారు. దీనివల్ల సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, పనిదినాలు, వేతనాల పెంపు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ వంటి సౌకర్యాలు కోల్పోతారన్నారు. నల్ల చట్టాలు చేసి, ప్రభుత్వ ఆస్తులను పెత్తందారులకు దోచిపెట్టే వ్యవస్థను అడ్డుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం మే 20వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. సీఐటీయూ నాయకులు ఎం.దేవా, అచ్చియ్యమ్మ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు..

ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు హాజరవుతున్నామని తెలుపుతూ మండల అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీ యూ నాయకులతో కలిసి ఎస్.కోట ఐసీడీఎస్ పీఓ ఉమకు శుక్రవారం నోటీసులు అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు డి.శ్యామల, జయలక్ష్మి, దంతేశ్వరి, ఎం.ధనలక్ష్మి, రాధ, జి.రమణమ్మ, వి.హైమావతి, ఏ.భూభారతి, జిల్లా కార్యదర్శి మద్దిల రమణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకుందాం..



వేపాడలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు

వేపాడ: బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కామేశ్వరి అన్నారు. 'కిశోరి వికాసం' కార్యక్రమంలో భాగంగా వేపాడ, వల్లంపూడి గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికలు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గర్భాశయాన్ని ఆరోగ్యంగా ఉంచడం కోసం ఫైబర్, కాల్షియం, పోటాషియం,మెగ్నీషియం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. విటమిన్-సి ఉండే పండ్లు తీసుకుంటే గర్భాశయంలో కణితులు ఏర్పడవని చెప్పారు. అలాగే ఒమేగా-3, ప్యాటీ ఆమ్లాలు ఉండే గుమ్మడి, అవిసె గింజలు, నువ్వులు తీసుకోవాలన్నారు. ఆశ వర్కర్లు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



పురిటిపెంట పంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు

గజపతినగరం: దేశ వ్యాప్తంగా కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా మార్చేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని చెబుతూ పురిటిపెంట పంచాయతీ కార్మికులు ఆ పంచాయతీ కార్యదర్శికి శుక్రవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీసం వేతనం రూ.21వేలు చెల్లించాలని, 132, 142, 680 జీఓలను, టెండర్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మావతి

దత్తిరాజేరు: ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 22 మంది గర్భిణులకు గైనకాలజిస్ట్ పద్మావతి శుక్రవారం వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు పలు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. విధిగా పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు చిన్న చిన్న వ్యాయామాలు చేయాలని చెప్పారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ బాధ్యతలు అప్పగించొద్దు



మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంబాబు, తదితరులు

మెరకముడిదాం: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టూడెంట్ కిట్ల పంపిణీ బాధ్యతల నుంచి పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లను తప్పించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు డిమాండ్ చేశారు. చెల్లాపురం గ్రామంలో పీఆర్టీయూ సంఘ నాయకులతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలతో చేయించాల్సిన పనులను పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లతో చేయించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈవిషయాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ద్వారా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు మాట్లాడుతూ పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లలతో పాఠశాలల్లో అన్ని పనులను చేయించడంతో పాటూ వేసవి సెలవుల్లో స్టూడెంట్ కిట్లను మోయించడం నిజంగా దురదృష్టకరమన్నారు. జిల్లా అధికారులు స్పందించి పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు ఈపనులు అప్పగించకుండా హమాలీలతో చేయించాలని, వీరిని సూపర్‌వైజింగ్‌కి మాత్రమే వినియోగించాలని సూచించారు. పీఆర్టీయూ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్.పైడిరాజు, ఆ శాఖ మండల అధ్యక్షుడు ఆర్.సింహాద్రి, నాయకులు ఆల్తి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా అడ్డతీగ, ముసలిఖండి



సారా రహిత గ్రామాలుగా ప్రకటిస్తూ సంబంధిత పత్రాన్ని, సర్పంచ్ సీతమ్మకు అందజేస్తున్న సీఐ విజయలక్ష్మి

గంట్యాడ: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిగువ కొండపర్తి పంచాయతీ పరిధిలోని అడ్డతీగ, ముసలిఖండి గ్రామాలను సారా రహిత గ్రీన్ విలేజ్‌లుగా ప్రకటించామని ఎక్సైజ్‌శాఖ సీఐ ఎం. విజయలక్ష్మి తెలిపారు. ఈమేరకు ఆ గ్రామాల ప్రజా ప్రతినిధులకు సంబంధిత పత్రాలను అందజేసారు. సీఐ మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మొదట ఈ రెండు గ్రామాలను సారా అమ్మకాలు కలిగిన సీ- కేటగిరి గ్రామాలుగా గుర్తించామన్నారు. మూడు నెలలుగా ఈగ్రామాల్లో రోజూ దాడులు, తనిఖీలు చేయడం, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. సారా కేసుల్లో ఉన్న గ్రామానికి చెందిన పాత ముద్దాయిలను బైండ్ ఓవర్ చేశామని చెప్పారు. ఈ గ్రామాల్లో కొద్ది రోజులుగా నాటు సారా తయారు చేస్తున్నట్లు కానీ, విక్రయించినట్లు కానీ ఒక్క ఫిర్యాదు రాలేదని, దీంతో వీటిని సారా రహిత గ్రామాలుగా ప్రకటించామన్నారు. దిగువ కొండపర్తి సర్పంచ్ చంపి సీతమ్మ,ఎస్ఐ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎర్రిబాబు, వీఆర్ఓ గణపతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



గుర్ల: ఆలయ ప్రతిష్ఠ పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు

గుర్ల: మండలంలోని పాలవలసలో పోలిపల్లి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠోత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు , బూర్లె శ్రీనివాసరావు, వల్లూరి రాము ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ఠ అనంతరం భక్తులు పసుపు, కుంకమతో పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

లక్కవరపుకోట: కొట్యాడ గ్రామంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం శిఖర పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం స్వామి వారి కల్యాణం జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘంఉపాధ్యక్షుడు కె.సన్యాసిరావు, కార్యదర్శి వి.బంగారాజు, తదితరులు పాల్గొన్నారు.